# గుణపాఠం

'కాంతినాథ్'

ఆరోజున తిరిగి తిరిగివచ్చి చాలిపోయింది. చాలీచాలని ఆదాయంతో ఏ రోజుకారోజు నిత్యావసరాలకు వెతుక్కుంటూ జీవయాత్ర సాగిస్తున్న మాకుటుంబము పట్ల సానుభూతి చూపుతున్న వాళ్లను తలచుకుంటూ, మా డబ్బును తమ స్వంతఅవసరాలను గడుపుకోడానికి వినియోగించుకొని సంవత్సరాల పర్యంతం మమ్ములను నానాబాధలకు, యిబ్బందులకు, కష్టాలకు గురిచేస్తూన్న అయోగ్యుడు జగ్గయ్య-పిల్లనిచ్చిన మామయైనా నరరూపరాక్షసుడు కాక మరేమిటా అనుకుంటూ సంధ్యాకాలపు పిల్లగాలుల చల్లదనానికి చాపమీద మా చిన్నమ్మాయి ప్రక్కన ఒత్తిగిలాను. కండ్లుమూతలు బడినాయి

'అది గ్రంథాలయావరణ. ఎవరికి కావలసిన గ్రంథాలను వారు తీసికొని చదువుకుంటున్నారు. నేనూ చదవాలని ఒక గ్రంథాన్ని తీసికొని ముందుంచుకున్నాను-కాని చదువు సాగడంలేదు. ఏదో యూహలతో మరోప్రపంచంలో విహరిస్తున్నాను. వెనుకగుండా మోహన్‌రావు వచ్చి "ఎడిటరుగారు ఏదో ఆలోచనా సముద్రంలో నున్నట్లున్నారే" అన్నాడు.

నేనేమి మాట్లాడలేదు. ప్రక్కనే యున్న గణేష్‌బాబు "ఏముంటుంది - పది! రోజులేకదటరా కుమార్తె పెళ్లియుంది - మనలనందరినిపిలచి భోజనం పెట్టాలి కాబోలురా భగవంతుడా! అని అయి యుంటుంది" అన్నాడు.

నాతోబాటు వాళ్లు కొంచము సేపు కూర్చున్నారు. నేను లేచి "వెళ్లివస్తా - కొద్దిగా అవసరమయిన పనియుంది" అని వెళ్లిపోయాను.

మా యింట్లో వివాహ ప్రయత్నాలు జోరుగా సాగుతున్నవి. చుట్టాలు, స్నేహితులతో సందడి యింతా అంతా కాకుండా యున్నది. మాకనకమ్మ నివ్వనుద్దేశించింది మా మేనల్లుడికే కాబట్టి కట్నాలు, కానుకల విషయం ప్రస్తావనకు రాకపోవడం నాకదేదో సావకాశమనిపించి పెండ్లి ప్రయత్నాలు బ్రహ్మాండంగా జరిగినవి. అంతా మేమే కాబట్టి లాంఛనాలు సయితం ఉభయుల ఒద్దికననుసరించినవి కదాయని నాయూహ.

విడిదిగృహంలో పెండ్లివాళ్లు వచ్చిదిగారు. పెండ్లి పందిట్లో మేళతాళాలు మ్రోగుతున్నవి. అక్కడున్నవాళ్లంతా వరునిరాకకు ఎదురు చూస్తున్నారు. ముహూర్త సమయం సమీపిస్తున్నకొద్దీ అందరితోబాటు నాకూ వరుడు రాకపోవ

డం ఆదుర్దా కలిగించింది. కారణమేమయి యుంటుందో విచారించి రమ్మని మా తమ్ముడిని పంపాను. — తెలియవచ్చిందేమిటంటే - తనతోటివాళ్లందరికి సైకిళ్లున్నవట; తనకూ సైకిలు కావాలని అల్లుని కోర్కె!

ఈ సంగతి తెలిసి నాకు చాల చీకాకేసింది. తనకు సైకిలు కావాలంటే యిప్పుడే అడగాలా! తర్వాత అడుగకూడదా, లేక యింతకుముందే అడుగకూడదా అనుకొని అయినా మాయమ్మాయి సుఖసౌభాగ్యాలనుద్దేశించి సరేనని సమ్మతించాను. పెండ్లికొడుకు పందిట్లోకి సపరివారంగా వచ్చాడు.

సాంప్రదాయప్రకారం' లాంఛనాలూ, మర్యాదలు జరిగినవి. కాని వరుడు ఎంతసేపటికి గది వదలి వివాహవేదిక మీదికి రాకపోవడం అక్కడున్నవాళ్లందరిలోను చాల అలజడి కలిగించింది. నేనే స్వయంగా పోయి "ఏమిటమ్మాయి - యీ ఆలస్యానికి కారణం" అని మా చెల్లెలిని అడిగాను.

"ఏమిలేదన్నయ్యా! - తాను వచ్చే ఏడాది ఎలాగూ మద్రాసులో బి. ఎ. చదువబోతున్నాడుకదా. మీకు మద్రాసులో నున్న యిల్లును తానుండటానికి యిప్పుడు తన కెందుకివ్వకూడదు అని పెంకిపట్లు పడ్తున్నాడు రామం" అన్నది.

"ఇదంతా ఏమిటమ్మా, అటువంటి వేవైనా యుంటే తర్వాత చూసుకో కూడదూ! - యిప్పుడేనా యీ రాద్ధాంతము" అన్నాను విసుగుగా.

"అదేమో నన్నయ్యా! వాడికి ఎంత చెప్పినా వినడంలేదు" అని లోపలికి వెళ్లిపోయింది.

నేను అల్లుడికి ఎంతో నచ్చచెప్పాలని ప్రయత్నించాను. కాని లాభంలేక పోగా ఒక్క విసురున వెళ్లిపోయి "ఇటువంటి మాట నిలకడలేనట్టి వానికి, అశాస్త్రగాడికి నా పిల్లనివ్వడంలేదు" అని తారామండలంగా మండిపడ్డాను.

మా ఆవిడ కాళ్లా వేళ్లాబడి నలుగురిలో నవ్వుబాట్లుగానుంటుంది కాబట్టి ఒప్పుకోమని పట్టుబట్టి ఒప్పించింది. దాంతోనైనా మూడు ముళ్లు పడుతవికదాయని ఆశించాను. కాని అప్పటికీ అల్లుడి వరాలకు అంతు కనుపించినట్లులేదు. పెండ్లి పెద్దల్లో ఒకాయనవచ్చి "శాస్త్రిగారూ! యింత ఖర్చుపెట్టి పెండ్లి చేస్తున్నారు; అల్లుడికి సైకిలు కొనిపెట్టానన్నారు, మద్రాసులోని యిల్లుయిస్తానన్నారు - వాడు బి. ఎ. పూర్తియయిన తర్వాత ఇంగ్లాండు పోయి బారిష్టరు చదువాలనుకుంటున్నాడట, అందుకుగాను అయే ఖర్చులో సగము భరించవలసియుంటుందని అంటున్నాడు. మరిమీరు–"–అన్నాడు.

నాకు ఒళ్లంతా కారం పూసినట్లయింది.

కోపాన్ని ణచుకొని "దానికి సమ్మతించక పోతే..." అన్నాను.

"తర్వాత ఆలోచించుకోవలసినవారు మీరే" అని పెండ్లిపెద్ద వెళ్లిపోయాడు.

నేనే స్వయంగా వరుడున్నచోటుకు వెళ్లి "నీవు కోరుతున్న కోర్కెలను ఆలోచించుకోడానికి కొంతశైమియ్యి - కక్కుర్తి పరిస్తే ఎలాగ! - ముహూర్తం వేళ మించిపోతున్నది లే" అన్నాను.

"అది తేలేంతవరకు పెండ్లి పీటలమీద కూర్చోను" అన్నాడు పెండ్లి కొడుకు.

నాకు ఒళ్లు తెలియని ఆవేశము, కోపము ఆవరించినాయి "నీవీ ముహూర్తాన పెండ్లికి సమ్మతించకపోతే లేచివెళ్లిపో - నీవుకాకపోతే యింకొకడవుతాడు" అని కేకలేసి వెళ్లిపోయాను.

ఇదంతాచూస్తున్నవాళ్లు నన్ను అప్పుడు వేదిక మీదచూచి ఆశ్చర్యచకితులై నేను చెప్పేది చెవులొగ్గి విన్నారు—"వివాహ కార్యక్రమంలో కొలది మార్పులు తప్పని సరియైనవి - వరుడుగా రామ్‌కు బదులుగా మరొకరిని నిర్ణయించబడుతూంది. వివాహముహూర్తంరాత్రి 8 గం. లకు" అని చెప్పి దిగి వెళ్లాను.

వివాహమహోత్సవంలో పాల్గొన వచ్చిన వారందరికి యీవిచిత్రపరిణామాలు అగమ్య గోచరంగానున్నాయి. రాత్రి ముహూర్తానికి కనకమ్మను, వచ్చినబంధువర్గములో నుండిన నరసింహారావుకు వైభవోపేతంగా వివాహంజరిగింది. నామేనల్లునికిస్తానని వాగ్దాన చేసిన వానికంటె ఎక్కువ సత్కారలాంఛనాలతో నరసింహారావును అల్లుణ్ణిచేసికున్నాము. "ఎవరురా! యీ నరసింహారావు" అడిగాడు గణేశ్ బాబు.

"మాచిన్నాయన కుమార్తెకొడుకు. వాళ్ళది చాల పేదకుటుంబమయినా మంచి బుద్ధిమంతుడు. ఫస్టుమార్కులతో యీ సంవత్సరమే స్కూలుఫైనలు ప్యాస్ అయ్యాడు. మనయింట్లో మనతోబాటు కలసిపోయే సంబంధం - యింతకంటె మనకు కావలసిందేమిటి బాబూ!" అన్నాను.

"భలేపనిచేశావు - తమ పెండ్లిళ్లు దరిద్రాన్ని తొలగిస్తవని నమ్మేపేరాశపరులకు యీనాడు నీవు చేసినపని గుణపాఠమగుతుంది" అన్నాడు రాఘవయ్య.

"కాకపోతే ఎవడబ్బ సంపాదించినముల్లె యుందని వీళ్ళీ కోర్కెలు కోరడం" అని పలవరిస్తుంటే కాంతంవచ్చి "ఏమండోయి! నిద్రలోకూడ మావాళ్ళ నాడిపోసుకోడ మేనా" అంటూ తట్టిలేపింది.

"మీవాళ్లు మంచి వాళ్లైతేగా" అంటూ లేచి చొక్కావిప్పి కాళ్లుచేతులు కడుగుకొని భోజనానికి తయారయ్యాను.